# బొంబాయి బావ

సరస్వతి...




“ఒరే సుబ్బారావ్! నువ్వేళ్లేది మార్చు!” ఆజ్ఞ జారీచేశారు జగ
ఫారెన్‌గాడు గాని, ఆ వేషం న్నాథంగారు-అరగంటనుంచీ

అద్దంలో వివిధ కోణాల్లో పరిశీలించుకుంటూ కులుక్కుంటున్న కొడుకుని చూసి.

సురేష్‌కి చిర్రెత్తుకొచ్చింది. "డాడీ! ఆ పేరుపెట్టి పిలవొద్దని మీ కెన్నోసార్లు చెప్పాను. యిక నేను సహించను!" అన్నాడు ఆవేశంగా.

"సహించక పోతె పోయావు లేవోయ్! ఆ తుప్పజుట్టు గొరిగించుకుని మామూలు తెల్లపాంటు, షర్టు వేసుకో! భయంకరమైన రంగుల పువ్వుల గుడ్డలు, రక్కిన పొదలాంటి జుట్టూ, నిన్నూ చూసి హడలి ఛస్తార్రా అక్కడి జనం! అంతెడల్పునా బెల్టేమిటి? ముఖం కప్పేసే కళ్ల జోడేమిట్రా-పగటేషగాడిలా!"

అల్ట్రామోడరన్ దుస్తుల్లో అభినవ మన్మధుడిలా వున్న తనని పగటేషగాడన్నందుకు సురేష్‌కి ఎంతకోపం రావాలో అంతా వచ్చింది. "డాడీ! ఫాషన్లు తెలియకపోతే వూరుకోండి! నా తల గురించి, నా బట్టల గురించి అవమానకరంగా మాట్లాడి నన్ను అవమాన పరిస్తే వూరుకోను. ఆఁ"

"కబుర్ల కేం లేవోయ్! షోకులు చేసుకోడంలో వున్న శ్రద్ధలో వెయ్యో వంతువున్నా ఈ పాటికి 'బియ్యే' పాసై వుండే వాడివి. ఘజనీ, ఘోరీలని మరపిస్తూ ఎనిమిదేళ్లనించీ కాలేజీ వదిలి రావైతివి."

'తొందరగా బి. ఎ. పూర్తిచేసి ఏ గుమాస్తా వుద్యోగమో వెలగబెట్టమనేగా-మీ వుద్దేశం! గుమాస్తాగా మనడం కల్ల. సినిమా హీరో కావాలన్నది నాకల.' మనసులోనే అనుకున్నాడామాట. తన కోరికని బహిర్గతం చేస్తూ బరువైన డైలాగు భావయుక్తంగా అనాలనుకున్నాడు. కాని అక్కడే ఈజీ ఛైర్లో పడుకుని వేశ్యామాతలా ఒకకంట కనిపెడుతున్న తండ్రిని చూసి ఆగిపోయాడు. 'ఛ! స్వేచ్ఛ లేదు. వ్యక్తి స్వాతంత్ర్యం లేదు. భావ స్వాతంత్ర్యం లేదు. యింకెన్నాళ్లో ఈ పరాధీనపు బ్రతుకు?' తన చిరాకునంతా పౌడరుడబ్బామీద చూపించాడు.

"అసలా రోజు రాంబాబుతోపాటు వెళితే పోయేది. యిప్పుడు ఒంటరిగా ఆ వూరెళ్లి యిల్లు కనుక్కోగలవా అని?" అనుమానంగా చూశారు జగన్నాధంగారు.

"డాడీ! బోడి బుర్రాయెపాలెం వెళ్లి ముప్పాతిక మూడు పూరి పాకల్లో అత్తయ్యాగారిల్లు కనుక్కోలేని అసమర్థుడి ననుకున్నారా?"

ఎర్రగా చూశాడు. 'నాకున్న తెలివి తేటలకి మరొకళ్లయితేనా నెత్తిన పెట్టుకు కొలిచేవారు.'

"ముందు వుత్తరం రాసినా బాగుండేది. రాంబాబో, సాంబయ్యో మామయ్యో గుంటూరు వచ్చేవారు......."

"నో-నో! అలా అయితే థ్రిల్లేముంది? సర్ప్రైజ్ విజిట్ చేసి వాళ్లని తారెత్తించాలని గదా నా వుద్దేశ్యం!"

"అఘోరించావు లే-వెధవ తెలివీ, వెధవవేషాలూ!" సణిగాడాయన.

కమలమ్మ చెల్లెలి కూతురిపెళ్లికి బొంబాయినుంచి విజయవాడవచ్చారంతా. ఆ సంగతి తెలుసుకుని కాంతమ్మ కొడుకుని పంపింది-అందరినీ వెంటబెట్టుకుని రమ్మని. ముఖ్యమైన అవసరాలకి తప్ప వాళ్లు బొంబాయినించి రారు. విజయవాడ రావడంతోనే వాతావరణం మార్పు మూలాన జగన్నాధంగారికి జలుబూ, జ్వరమూ పట్టుకున్నాయి. "నాకు బాగైనాక అందరంవస్తాంలే రాంబాబూ! అమ్మ నేమనుకోవద్దని చెప్పు!" అని చెప్పారప్పుడు. పెళ్లిపనికాగానే ముందు సురేష్ని పంపేలా ఒప్పందం తీసుకుని వెళ్లాడు రాంబాబు.

ముస్తాబు ముగించి బాగ్ భుజాన తగిలించుకున్నాడు సురేష్. ఎరుపూ తెలుపూ గళ్ళతో కొట్టొచ్చినట్లుందది. సురేష్ ఉపయోగించే రకరకాల ఫాషన్ సామాగ్రితో నిండి వుందది. బుర్రాయెపాలెంలో వాటిని ప్రదర్శించే నిమిత్తం కాస్త బరువనిపించినా తీసుకెడుతున్నాడు. అక్కడున్నన్నాళ్ళూ ఏ సమయంలో ఏ దుస్తులు వాడాలో ముందే నిర్ణయించి పెట్టుకున్నాడు కూడా.

"జోలె తగిలించుకున్నట్లు అదెందుకురా భుజాన? సూట్కేస్ తీసుకెళ్ళరాదూ?" అంటున్న తండ్రి వైపు కొరకొర చూశాడు. 'వూరుకుంటున్న కొద్దీ ఈయనగారి నిరంకుశత్వం పెచ్చు పెరిగిపోతోంది. హుఁ.'

భర్త వినకుండా కొడుక్కి-లక్ష జాగ్రత్తలు చెప్పింది కమలమ్మ. "ఈడొచ్చిన కూతురుందిరా బాబూ! మేనరికం సాకుతో ఆ కొండముచ్చుని నీకు అంటగట్టాలని ఎత్తు. అందుకే ప్రేమ కారిపోతున్నట్లు కొడుకుని పంపింది. జాగ్రత్త సుమా! ఆవిడ కల్లబొల్లి కబుర్లకి లొంగిపోయేవు ..."

తేలుకుట్టినట్లు యింతెత్తున

ఎగిరిపడ్డాడు సురేష్. "నా స్టేటస్ ఏమిటి? నేనేమిటి? నా కాళ్ళు పట్టుకుంటే మాత్రం ఆ పల్లెటూరి గొడ్డుని ఎలా చేసుకుంటాననుకున్నావ్? కలలో కూడా జరగదా పని. డోంట్ వర్రీ!" అతిశయంగా అభయ మిచ్చాడు తల్లికి.

గుంటూరులో బస్సు దిగేసరికి "పల్లె పల్లెకూ బస్సు" అన్న నినాదంతో రారమ్మని పిలుస్తూ రడీగా వుంది బుర్రాయెపాలెం బస్సు. గుంటూరు నుంచి ఆటోలో వెళ్ళా ల్సొస్తుందను కున్నాడు మొదట. ఇంత మారు మూల పల్లెకు కూడా బస్సు సౌకర్యం అందజేసిన ప్రభుత్వాన్ని ఏమని కొనియాడాలి?....నాయకులు సాధించిన ప్రగతికి ఎంతైనా గర్వించాడు సురేష్! అదృష్టం బాగుండి అట్టే రద్దీ లేదు. కిటికీ దగ్గరి సీటు దొరికింది. కూర్చోగానే కదిలింది బస్సు. మేనత్తగారి వూరిలో తనకి జరగబోయే సన్మాన సత్కారాల గురించిన వూహల్లో ఊగుతూ జోగుతూ వుండగా కండక్టరు రంకెలు వినిపించాయి-"దిగండి! దిగండి! ఆలస్యం అయిపోతుంది."

ఆలోచనల్లోంచి తేరుకుని కిటికీ లోంచి బయటికి చూశాడు సురేష్!

"ఇదేంటి! వూళ్ళోకి రాదా బస్సు?" అడిగాడు కండక్టరుని.

"రాదు. దార్లో గండి పడింది. దిగాలి-దిగాలి! లేటయిపోతుంది." అరిచాడు మళ్ళీ.

"ఊళ్ళోకి ఎలా వెళ్ళాలి?" అడిగాడు అయోమయంగా సురేష్. అక్కడ దిగింది తనొక్కడే!

వెర్రి వేపకాయిని చూపినట్లు చూశాడు కండక్టరు. "ఎలాగేంటి? లెఫ్ట్-రైట్!" అన్నాడు ఎకసక్కెంగా.

తెల్లబోయి చూస్తూ నిలబడ్డ సురేష్ ముఖం మీద ఎర్రదుమ్ము రేపుకుంటూ బస్సు వెనక్కి తిరిగి పోయింది.

'ఛీ-ఛీ! బస్సుని నమ్మడం ఎంత పొరపాటైంది! మొదట అనుకున్నట్లే ఆటోలో వెళితే ఎంత దర్జాగా ఉండేది.'

చీకట్లు ముసురు తున్నాయి. పిట్టపురుగు లేదెక్కడా. కోతలు కోసిన పొలాలు బీళ్ళులాగున్నాయి. సంక్రాతి రోజులేమో, చలిగాలి మొదలైంది. 'మైలూ నడవ్వల పిందే! మైగాడ్!' అనుకున్నాడు-కాళ్ళకి బుద్ధి చెపుతూ.

అలవాటులేని నడకతో ఆయాసంగా వుంది. భుజాన బరువొకటి. దాహంతో గొంతెండుకు పోసాగింది. ఎలాగో ఊళ్ళో కొచ్చాడు

గాని, ఇల్లు గుర్తుపట్టడం కష్టమైంది. ఈ పదిహేనేళ్ళలో వూరు చాలా వరకు మారిపోయింది. పెంకుటిళ్ళ స్థానే డాబాలు వెలిశాయి. కొన్ని ఇళ్ళకు కరంటు కూడా వుంది.

ఎవరినడగాలా అని దిక్కులు చూశాడు. ఓ పడుచుపిల్ల ఎత్తు పీటెక్కి వీధి వాకిట్లో వున్న సన్నజాజి పందిరిమీద పువ్వులు కోసుకొంటోంది. చిన్నగా నకిలించి గొంతు సవరించుకొన్నాడు.

"ఏమండీ! సాంబయ్యగారి ఇల్లెక్కడో చెపుతారా కాస్త?" అన్నాడు స్టయిలుగా.

ఆ పిల్ల సురేష్‌ని ఎగాదిగా చూసిందో క్షణం. కనురెప్పలల్లార్చింది. సురేష్ సాధ్యమైనంత ఠీవి నటిస్తూ ఫోజుగా నిలబడ్డాడు. "చూడండీ, ఆ ప్రక్క సందులో కెళ్ళి ఎడం చేతివైపు తిరగండి. అక్కడినుంచి నాలుగ్గజాలు ముందుకు వెళ్ళితే మరో సందు వస్తుంది. అటు కుడివేపు తిరిగి కొంచెం దూరం నడిచాక రామాలయం కనపడుతుంది. దాని ప్రక్కనున్న వీధిలోకెళ్ళి తూర్పుకి తిరిగి మూడు గజాలు ముందుకు నడవండి! ఎదురుగా ఎత్తరుగుల డాబా ఇల్లు కనిపిస్తుంది. అదే సాంబయ్యగారిల్లు!" అంది-కొంగు నోటికడ్డం పెట్టుకుని.

'గొంతెంత స్వీట్‌గా వుంది!' మెచ్చుకున్నాడు మనసులోనే.

"థాంక్స్!" చెప్పిన గుర్తులని మననం చేసుకుంటూ ముందు కెళ్ళాడు సురేష్.

పది నిముషాలు అటూ ఇటూ తిరిగినా రామాలయంగాని, మరో ఆలయంగాని కనపడలేదు. చీకటి పడిపోయింది. చలి వణికించేస్తోంది. వీధిలో కరెంట్ స్థంభాలున్నాయన్న పేరేగాని ఒక్కదానికీ బల్బు లేదు. పల్లెటూళ్ళల్లో మరీను! దీపాలు పెడితే వీధిలో మనుషులుండరు.

ఇక లాభంలేదని ఒక ఇంటి ముందాగాడు. లోపలెక్కడో వున్నారు మనుషులు. "ఏమండీ!" పిలిచాడు గట్టిగా. పిలుపుకి సమాధానంగా "బొయ్యి" మంటూ పిపంగిలాంటి కుక్కొకటి దూసుకొచ్చింది మీదకు. అమాంతం ఎగిరి అంత దూరాన పడ్డాడు సురేష్. నెమ్మదిగా లేచి దుమ్ము దులుపుకొని చుట్టూ చూసాడు— ముందు ఎవరైనా చూసారేమోనని. 'థాంక్ గాడ్! ఎవరూ లేరు. ఇంకా ఇక్కడ నిల్చుంటే మర్యాద దక్కద'ని గబగబా ముందుకి అడుగు వేసాడు.

దాహంతో గొంతెండుకుపోయి నాలుక మడతపడిపోతోంది. కాసిని మంచినీళ్ళయినా తాగాలన్న ఉద్దేశ్యంతో మరో ఇంటి ముందాగాడు.

"చెయ్యేరికే లేదు. పో-పో!" అందా యిల్లాలు లోపల్నుంచే.

తలకొట్టేసినట్లయింది సురేష్‌కి.

"అదిగాదండీ...."

"చెపుతుంటే నీగ్గాదూ! ఏంది అట్లా మిడిగుడ్లేసుకు చూస్తా!...."

"ఏందప్పా? ఎవురూ?" అరా కొచ్చింది మరో ఇల్లాలు.

"అది గాదే సూరమ్మా! మొన్నా తాటికాయంత చెంబు మొద్దల్లె వుంది. కాళ్ళు కడుక్కొని గాబు దగ్గిర పెట్టి ఇంట్లోకి పొయ్యా! కాసేపుటికొచ్చి చూస్తే లేదే! ఏం మాయో చెప్పు. మాదాకవళం అని వచ్చేది—చేతికందింది జోల్లో ఏసుకుపొయ్యేది!"

'ఛీ-ఛీ! యిక ఎవరింటిముందూ ఆగకూడదు. అందుకే మమ్మీకి విలేజస్ అంటే అంత ఎలర్జీ. మేనర్స్‌లెస్ క్రీచర్స్' తిట్టుకుంటూ అక్కడినించి కదిలాడు.

యిద్దరు పెద్దమనుషులు చుట్టలు కాల్చుకుంటూ చెంబులు తీసుకెళు తున్నారు అటుగా. ప్రాణం లేచొచ్చింది సురేష్‌కి. అతను నోరు తెరిచేలోగానే అందులో ఒకాయన, "ఎవురదీ? ఎవురబ్బాయ్? ఏందట్లా చీకట్లో తచ్చాడుతున్నా?" గద్దించాడు.

ఆయన గద్దింపుతో సగం ప్రాణం పోయింది సురేష్‌కి.

"సా....సాం....బయ్య...గారిల్లు.. ఎ....ఎ...."

"సాంబయ్యగారిల్లు ఈ డెందుకైందీ, అటు బో" చీకట్లోకి చెయ్యి చూపించి వడి వడిగా ముందుకు సాగిపోయారిద్దరూ.

ఆయన చూపించినదెటో అంతు పట్టలేదు సురేష్‌కి.

కాస్తదూరంలో ఒకయింట్లోంచి పది పన్నెండేళ్ల పిల్ల గిన్నె పట్టుకుని వీధిలోకొచ్చింది. 'హమ్మయ్య! ఈ పిల్లనడిగి వివరంగా తెల్సుకోవాలి.'

"యిదిగో అమ్మాయ్!ఆగాగు!" అన్నాడు తొందర తొందరగా నడుస్తూ. మళ్లీ ఆ పిల్ల యింకో యింట్లోకి మాయమయిందంటే అదొక చావు అని.

మసక చీకట్లో సురేష్‌నిచూసిన ఆ పిల్ల ఒక్కసారిగా "వామ్మో!" అంటూ వెర్రికేక పెట్టింది. చేతిలో కూరగిన్నె నేలపాలైంది.

"ఏందమ్మా? ఎవురే తల్లీ!" అంటూ యింట్లో వాళ్లూ, చుట్టు ప్రక్కల వాళ్లూ పరుగెత్తుకొచ్చారు క్షణంలో!

తల్లి కాళ్లకి చుట్టుకుపోయిందా పిల్ల. "అమ్మా! దొంగోడే, నా మీద మీదకొచ్చాడే!" అంది వెక్కి-క్కి-పడుతూ.

"వామ్మో! ఎంత గండం గడిచిందీ! మెళ్లో గొలుసు తెంచుకు పోవాలని గావాల!" అంది పిల్ల తల్లి—గొలుసు తడిమి చూసుకుంటూ.

కొయ్యబారిపోయి నిలబడ్డ సురేష్‌ని చుట్టు ముట్టారంతా. చేతులు వెనక్కి-విరిచి పట్టుకున్నారు.

"ఏ వూరు నీది?"

"యింకా ఎంతమందున్నారు మీవాళ్లు?"

"ఎక్కి-డెక్కి-డ దొంగతనాలు చేశావ్?" ప్రశ్నల వర్షం కురిపించారు పోలీసాఫీసర్లలా.

"అదిగాదు......అదిగాదు...... నేను....నేను ..." పిడచగట్టుకుపోతున్న నాలుకని తడుపుకుంటూ చెప్పబోయాడు సురేష్.

"ఆడి దొంగమాటలు యినేదేందే! తలా నాలుగు వుతక్కి-!"

"గుంటూరులో వుండే బంది పోటు ముఠా వాళ్లేనే ఈళ్లు!"

"జోల్లో యింకెన్ని దొంగ సామాన్లున్నాయో!తన్నండ్రా-నిజం చెప్పేదాకా!"

భయంతో బిగుసుకుపోయి కళ్లు మూసుకున్నాడు సురేష్. 'వాళ్ల కేకల్లో తన మొరవినే నాథుడు లేడు. ఈ రోజుతో తన పనిసరి....'

"ఆగండాగండి!" అంటూ ఆపద్బాంధవుడిలా వచ్చాడు రాంబాబు. అందర్నీ నెట్టుకుంటూ ముందుకొచ్చి సురేష్ చెయ్యి పట్టుకున్నాడు. "మా బావ బొంబాయి నుంచి వచ్చాడు!" అన్నాడు వగరుస్తూ.

అంతా తెల్లబోయారు.

"జగన్నాథం కొడుకా? మరా మాట చెప్పదేం?"

"దొంగేసికంలాగుండె, నంగి నంగి మాటలాయె. మాకేం తెల్సు!" నవ్వుకుంటూ వెళ్ళారు తలా ఒకదారీ.

"పద బావా, ఇంటికి. ముందు ఉత్తరం రాసుంటే బండి కట్టుకొచ్చేవాడినిగా—బస్సు దగ్గరకి" అన్నాడు రాంబాబు.

ఇద్దరూ ఇల్లు చేరారు.

ఆ ఇల్లు చూసి ఆశ్చర్యపోయాడు సురేష్. ఇందాక రెండు సార్లు ఆ ఇంటి ముందునుంచే వెళ్ళాడు. ప్రక్కి-ంటి పందిరిమీద మిగిలిన సన్నజాజి పూలు విరగబడి నవ్వుతున్నాయి సురేష్‌ను చూసి.

'ఎంత ఫూల్‌ను చేసిందీ?'

పళ్ళు కొరుక్కున్నాడు కసిగా.

"ఏరా సుబ్బారావ్! మీ అమ్మా నాన్నా రాలేదేరా?" పలకరించాడు సాంబయ్య—చుట్ట కాల్చుకుంటూ వీధరుగుమీద కూర్చుని.

సుబ్బారావన్నందుకు చిర్రెత్తుకొచ్చింది సురేష్‌కి.

అది గమనించాడు రాంబాబు.

"నాన్నా! బావ పేరు మార్చుకున్నాడు. సుబ్బారావు కాదు, సురేష్‌బాబు!" వివరించాడు తండ్రికి.

"పేరేదైతే నేరా! మడిపి అదేగా!" వేదాంతం చెప్పాడాయన.

"ఆయనదంతా అడ్డగోలు పంచాంగం. నువ్వు రారా బాబూ-లోపలికి!" కాంతమ్మ చాటంత మొహంతో ఆహ్వానించింది మేనల్లుడిని. మంచం వాల్చింది-కూర్చోమని.

"నాన్నకెట్లా వుందిరా? ఎప్పుడొస్తానన్నాడూ? మీ అమ్మరానే లేదే! ఆరిగారికి మేం కనపడతామా? బస్తీ దొరసానాయె!" పరామర్శలు, నిష్టూరాలూ కలగాపులగం చేసిందామె.

"అది కాదాంటీ! అస...."

"కాళ్ళు కడుక్కో బావా!" పక్కన కోయిల కూసింది.

మాటలాపి తలతిప్పి చూసాడు సురేష్. చూపు నిలిచిపోయింది 'ఓ! హేమ్మాలిని ఇక్కడెందుకుంది? ఏదైనా షూటింగా...'

"ఏంటి రా, అట్లా చూస్తా? సుబ్బులుగాదూ, మర్చిపోయ్యావా?" నవ్వింది కాంతమ్మ.

"నో-నో సుబ్బులు! షి ఈజ్ హేమ్మాలిని. వాటెవండర్!" అన్నాడు పైకే.

సిగ్గుతో లోపలికి పరిగెత్తింది మరదలు పిల్ల. బారెడు జడ బావగార్ని కవ్విస్తూ మాయమైంది ఆమె వెనకే.

"ప్రాప్తం లేకపోయిందిగాని, దాన్ని నీకిచ్చి చెయ్యాలని ఖాయం చేశాం. ఇక రేపు మాఘంలో పెళ్ళి!" విచారంగా అంది కాంతమ్మ.

'ఏమిటీ! హేమని ఆ దగుల్బాజీ వీర్రాజుకిస్తారా! జరగదు. అలా జరగనివ్వడు తను.' భుజా లెగరేసాడు సురేష్.

వీర్రాజును తలుచుకోగానే విరిగిన ముందు పన్ను సలపడం పుట్టిందిసురేష్‌కి. 'దొంగరాస్కెల్! చిన్నప్పటినుంచీ ప్రత్యర్థే తనకి. చదువూ సంధ్యాలేని అంట్ల వెధవ! చిరిగిన లాగూ ఎగలాక్కుంటూ తోటలవెంటా, దొడ్లవెంటా తిరిగే బడుద్దాయి! చెరువులో ఈతలు

కొట్టటంలో, చెట్లెక్కి దొంగ తనంగా కాయలు కొయ్యడంలో, గోడలెక్కి దూకడంలో ఎక్స్‌పర్టు! పిల్లగాంగుకి వాడో నాయకుడు! తనకేమీ రావని వుడికించి ఏడ్పించే వారంతా. ఇస్త్రీ గుడ్డలు మాపిపోతా యని మట్టిలో ఆడేవాడు కాదు తను. తినేది పచ్చడి మెతుకు లైనా దున్నపోతు బలం వాడిది.

'ఆటల్లో ఏదోఒక వంకన చితక బాదేవాడు. ఒకసారి ముందుకు తోసి పన్ను విరగ్గొట్టాడు. ఆ రోజైన తగువుతో మళ్ళీ ఈ వూరు రానివ్వలేదు మమ్మీ! యూస్‌లెస్ ఫెలో! ఇప్పుడేం చేస్తున్నాడో? దుక్కి దున్నుకుంటు న్నాడో, వున్న రెండెకరాలు అమ్ముకు తిని గొడ్లు కాస్తున్నాడో! అసలు నన్ను చూశాక హేమ ఆ వీర్రాజుగాడినిచేసుకోవడానికి ఒప్పు కోదు గాక ఒప్పుకోదు.

'"ఈ పెళ్ళి తప్పించి నన్ను రక్షించు బావా!" అని జాలి చూపులతో అర్థించదూ! సినిమాలో హేమమాలిని సరసన నటించడం మాట తర్వాత చూసుకోవచ్చు. ముందు ఈ హేమకి శాశ్వత హీరోనయిపోవాలి.'

"లెగరా బాబూ! స్నానం చెయ్యి-భోంచేద్దువుగాని!" కాంతమ్మ గారి హెచ్చరికతో టెక్నికలర్ కల లోంచి తేరుకుని హుషారుగా లేచాడు సురేష్.

వేడి వేడి అన్నం-ఆవకాయ, పెరుగు. గుండ్రాళ్ళంత ముద్దలు మింగి లేచాడు.

వేడి నీళ్ళ స్నానం, కడుపు నిండా భోజనం, అలసి వున్న శరీరం. ఎప్పుడు నిద్ర పట్టిందో బారెడు పొద్దెక్కాకగాని మెలకువ రాలేదు.

"లేచావా బావా! నీకోసం రెండు సార్లొచ్చా! టిఫిన్ చల్లారి పోతుంది.రా- ముఖం కడుక్కుం దువుగాని" సుబ్బలక్ష్మి వచ్చింది. తలార స్నానం చేసి తెల్ల జరీ చీరలో ఉషాబాల లాగుంది.

"హాయ్ హేమా!" అన్నాడు వుత్సాహంగా.

"నా పేరు సుబ్బలక్ష్మి బావా!" అంది నవ్వుతూ.

"బ్లడీ నేమ్! నీలాంటి బ్యూటీ క్వీన్‌కి సుబ్బలక్ష్మని పేరు పెట్టిన వాళ్ళకి ఏ శిక్ష వేసినా చాలదు. యు ఆర్ ఏంజల్. అసలు నన్ను అడిగితే హేమ్మాలిని నీ కాలిగోటికి కూడా సరిపోదు... అఁ...."

"నిజంగానా బావా!" అల్చి ప్పల్లా విచ్చుకున్నాయి కళ్ళు ఆశ్చర్యంతో.

"ఆహాహా! తల్లక్రిందులుగా తపస్సు చేసినా హేమ్మాలిని ఆశ్చర్యాన్ని యింత స్ఫుటంగా చూపించలేదు. నీ ఫేస్‌లో ఫీలింగ్స్ అద్దంలో ప్రతిబింబంలా కనబడుతు...."

"ఏంటి బావా! యింకా లేవలేదు?" సుడిగాలిలా వచ్చాడు రాంబాబు గదిలోకి.

మండిపోయింది సురేష్‌కి. పానకంలో పుడకలా రసభంగం చెయ్యడానికొచ్చాడు.

"లే! లే! రాజుబావ తొమ్మిదింటికల్లా యిక్కడుంటానన్నాడు. యివాళ అమరావతి ఎక్స్‌కర్షన్. చిన్న కార్లో వెడదాం!" రాంబాబు తొందర చేశాడు.

వీర్రాజు వస్తాడన్న మాట వినగానే చివుక్కున లేచాడు-మంచం మీద నించి. 'ఆ డర్టీ ఫెలో వచ్చేసరికి నీట్‌గా టాయిలెట్ అయి వుండాలి. ఇది మంచి అవకాశం కూడా. తనకీ, వీర్రాజుకీ వున్న తేడా హేమకి స్పష్టంగా కనబడుతుంది.' గబగబా బాత్‌రూంలో దూరాడు.

పులిచారల దుస్తులు ధరించి ముస్తాబు ముగించాడు. వీర్రాజు ముందు ఎలా నవ్వాలి, ఎలా ఫోజు పెట్టాలి అన్నవి కూడా అద్దంలోనే ప్రాక్టీసు చేశాడు. 'అసలు తనని చూడగానే సిగ్గుతో ముప్ఫయ్ మూడు మెలికలు తిరిగిపోడూ వెధవ!'

వాకిట్లో కారాగిన చప్పుడు. పిల్లలంతా "బావొచ్చాడు!" అంటూ గెంతుతున్నారు. గదిలోంచి బయటకొచ్చాడు సురేష్! కార్లోంచి దిగిన సూటువాలాని చూసి రెప్ప వేయడం మర్చిపోయాడు కాస్సేపు. ఆరడగుల ఎత్తున తీవిగా, ధృడంగా వున్న వీర్రాజు చక చక నడుస్తూ వచ్చాడు లోపలికి. "లక్ష్మీ! బి. ఎ. రిజల్ట్సు వచ్చాయి. ఫస్టుక్లాసొచ్చింది నీకు. యిదిగో పేపరు!" అందిచ్చాడు ఎదురొచ్చిన సుబ్బలక్ష్మికి.

పేపరందుకుని సంబరంగా నెంబరు చూసుకోసాగింది సుబ్బలక్ష్మి.

"బావా! సురేష్‌ని గుర్తుపట్టావా? బొంబాయినించి వచ్చాడు!" రాంబాబు వీర్రాజుకి పరిచయంచేశాడు.

"ఓ! సుబ్బారావ్! హౌ ఆర్ యు?" అంటూ చెయ్యి ముందుకు చాచాడు వీర్రాజు.

"బావా! రాజుబావ డాక్టరు. గుంటూరులో సొంత క్లినిక్ పెట్టుకున్నాడు. అందుకే కారుకొనుక్కున్నాడు-అక్కడికీ యిక్కడికీ తిరగడానికి వీలుగా....."

రాంబాబు మాటలు చెవుల్లో సీసం కరిగించి పోస్తున్నట్లున్నాయి సురేష్‌కి. 'అందరిలో హీరోలాగా వెలిగిపోవాలని వచ్చాడు. యిప్పుడు తన పాత్రేమిటి?'